# జాతకం

-భళ్ళమూడి నాగరాజు

కుశలాపురం అగ్రహారంలో రామావధానికి మంచి పేరుంది. చెయ్యి చూడగానే జరిగేది, జరగబోయేది కూడా కరెక్టుగా చెబుతాడనీ, గతంలో ఎంతోమంది చెయ్యి చూసి చెప్పినవన్నీ అక్షరాలా నిజం అయ్యాయనీ ప్రతీతి. అందువలన రామావధానికి మంచి పేరు, ప్రతిష్ఠ కూడా వచ్చాయి.

అదే వూరిలో అంజనయ్యకీ పేరు వుంది. గతంలో నలుగురు మనుష్యుల్ని అడ్డంగా నరికేసి అత్తవారింటికి వెళ్ళి వచ్చినట్లు, ఓ నెలరోజులు జైల్లో ఉండి రావడంతో అంజనయ్య అంటే అందరికీ భయం.

అంజనయ్యకి ఒక్కసారిగా వింత కోరిక పుట్టింది.

తను రానున్న ఎన్నికల్లో పోటీకి నిలబడి గెలవాలన్న ఆశ పుట్టడంతో గెలుస్తానో లేదోనన్న అనుమానం కూడా కలిగింది.

అయితే వెంటనే రామావధాని గుర్తుకురావడంతో తన వందిమాగధులతో బయలుదేరి ఓ బుట్టెడు కమలాపళ్ళు కొని అవధాని ఇంటికి చేరుకున్నాడు.

అంజనయ్యని చూడగానే అవధానికి ముచ్చెమటలు పోసి నోటంట మాట రాలేదు.

అంజనయ్య అతి వినయంగా అవధానికి నమస్కరించి "నేను ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్నాను. నా చెయ్యి చూసి గెలుస్తానో లేదో తమరు చెప్పాలి" అనేసరికి అవధానికి నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది.

గెలుస్తావు అని చెబితే... తీరా గెలవకపోతే మరో మర్డర్ వాడి ఖాతాలోజమ అవుతుంది కొన్నాళ్లలో. గెలవ్వు అని చెబితే ఇప్పుడే ఆ మర్డర్ ఏదో అయిపోతుంది అని ఆలోచించి వెంటనే ఓ చిన్న కాగితం తీసుకుని చకచకా "ఇవాళ మంగళవారం. నేను మాట్లాడను. మౌనవ్రతం. అందువలన తమరు మరో రోజు రండి" అని రాసి అంజనయ్య చేతిలో వుంచాడు.

అక్షరం ముక్క రాని అంజనయ్య ప్రక్కనేవున్న వాసుదేవరావుకి అందించి అసలు విషయం తెలుసుకుని "సరే మరోసారి వస్తాం" అని పళ్ళబుట్ట అక్కడే వుంచేసి వెళ్ళిపోయాడు.

'హమ్మయ్య బ్రతికిపోయాను' అనుకున్నాడు.

కానీ మరునాడు ఉదయం ఇంకా ఆరవుతుండగానే తలుపు తట్టాడు అంజనయ్య.

పూజ సగంలో ఆపి వచ్చి తలుపు తీసి గతుక్కుమన్నాడు.

'తప్పదు వీడి చేతిలో నా చావు తప్పదు' అనుకుని ఆ చావేదో కొన్నాళ్ళు వాయిదా పడేట్లు మనసులోనే ప్లాన్ చేసుకుని అంజనయ్య చెయ్యి అందుకుని-

"ఆహా... ఓహో... తమరు గెలవకపోవడం ఏమిటి? తప్పకుండా గెలుస్తారు. పోటీ చేయండి" అన్నాడు అవధాని నవ్వుతూ.

అవధాని మాటలకి పొంగిపోయి వెంటనే జేబులోంచి రెండు పచ్చనోట్లు అవధాని చేతిలో పెట్టి, కాళ్లకి నమస్కారం కూడా చేసి బయలుదేరాడు అంజనయ్య.

ఆ క్షణానికి అవధాని ఊపిరి పీల్చుకున్నాడు.

'వీడు గెలవడు. నన్ను చంపక మానడు. ఈలోగా పరారైపోదాం' అనుకున్నాడు.

***

రోజులు గిర్రున తిరిగిపోయాయి. ఇంకా సంవత్సరం దాటితేగానీ ఎన్నికలు రావు అనుకున్న అవధానికి గుండె గతుక్కుమంది. మధ్యంతర ఎన్నికలు ప్రకటించారు. అంజనయ్య అన్ని పార్టీలవారినీ కలిసాడు.

ఏ పార్టీ వాళ్ళూ టిక్కెట్టు ఇవ్వలేదు.

అంతే అగ్గిమీద గుగ్గిలంలా అయి కుశలాపురం చేరుకున్నాడు.

అదే సమయంలో అవధాని ఇల్లు ఖాళీ చేసి వేరే ఊరు వెళ్లిపోవడానికి సామాన్లు సర్దుకుంటుండగా అంజనయ్య దబదబా తలుపులు బాదాడు.

తలుపు తీసి నిశ్చేష్టుడై ఉండిపోయాడు అవధాని.

"ఏందయ్యా పంతులు. నేను గెలుస్తానని చెప్పావు. అసలు నాకే పార్టీ టిక్కెట్టే ఇవ్వకపోతే నేనెలా గెలుస్తానయ్యా" అని పెద్ద గొంతుకతో కేకలు వేయగానే క్షణంలో అవధాని బుర్ర పాదరసంలా పనిచేసింది.

"అయ్యా! జగమెరిగిన బ్రాహ్మణుడికి జంధ్యమేల అన్నట్లు మీకు పార్టీ టిక్కెట్టుతో సంబంధం ఏముందండీ. మీరు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయండి. వెధవది మీరు పోటీ చేస్తున్నారని తెలిస్తే మిగతా పార్టీల వాళ్ళు ప్రచారం మానుకుంటారు" అన్నాడు ధైర్యం చేసి.

"నిజమా పంతులు. అలా పోటీ చేయవచ్చా?" అంటూ ఆనందంగా గంతులు వేస్తూ వెళ్లిపోయాడు.

"హమ్మయ్య ఈసారి కూడా తప్పించుకున్నాను. ఇక ఇదే ఆఖరు. వీడు ఎలాగూ పోటీ చేస్తాడు. ఓడిపోతాడు. నా చావుకి ముహూర్తం పెడతాడు. అందువలన ఇవాళే ఊరు వదిలి వెళ్లిపోవాలి" అని గట్టిగా నిశ్చయించుకుని చడీ చప్పుడు కాకుండా పెళ్లాం పిల్లలతో హైదరాబాద్‌లో తన బావమరిది ఇంటికి వెళ్లిపోయాడు అవధాని.

***

ఎన్నికలు వచ్చేసాయి. కుశలాపురం అగ్రహారంలో రెండు ప్రధాన పార్టీలు హోరాహోరీగా ప్రచారం చేసుకున్నాయి.

అంజనయ్య కూడా తన లెవెల్‌లో ప్రచారం చేసుకున్నాడు.

అనుకున్న ప్రకారం ఎన్నికలు రావడం, ఓటింగ్ అయిపోవడం జరిగింది.

ఇక రేపే ఎన్నికల ఫలితాలు. హైదరాబాద్‌లో ఇంట్లోంచి బయటికి రాకుండా పేపర్లలోనూ, టీవీల్లోనూ వార్తలు వింటున్న అవధానికి గుండెలో దడ పుట్టింది.

'నా ఆచూకీ తెలుసుకుని రాడు కదా' అన్న భయం పుట్టింది. దాంతో జ్వరం వచ్చింది. మంచానపడ్డా వార్తలు వినడం మానలేదు.

వార్తలు వస్తున్నాయి. ఊపిరి బిగబట్టి మరీ వింటున్నాడు అవధాని. రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో కుశలాపురం అనేసరికి అవధాని గుండె రెట్టింపుగా కొట్టుకోసాగింది.

'అగ్రహారం నుంచి అంజనయ్య మూడువందల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు' అని చెప్పేసరికి అవధాని గుండె ఒక్క క్షణం ఆగినంత పనయి ఆశ్చర్యం నుండి తేరుకుని వెంటనే బయలుదేరి



ఆఘమేఘాలమీద కుశలాపురం చేరుకున్నాడు.

అంజనయ్య భారీ ఊరేగింపుగా అవధాని దగ్గర కొచ్చి పాదాభివందనం చేసాడు. అవధానికి కలిగిన

అనుమానం తీర్చుకునేందుకు అంజనయ్యని మెల్లగా లోపలకు పిలిచి-

"అంజనయ్యగారూ! మీరు గెలుస్తారని నాకు తెలుసు. ఇంతకీ ఏం చేసారండీ అంత మెజారిటీ వచ్చింది'' అని తన అనుమానం బయటపెట్టాడు.

"పిచ్చి పంతులూ! గతంలో మనమేకదా రిగ్గింగ్ చేసింది. ఆళ్ళు సెయ్యమని చెబితేనే రిగ్గింగ్ చేసేవాడ్ని. ఆ నాయాళ్ళు గెలిసి నన్ను మరచిపోయేవాళ్ళు. మళ్లీ ఎలక్షన్లు వస్తేనే మనం కనిపించేది. ఈసారి నువ్విచ్చిన ధైర్యంతో నాకు నేనే రిగ్గింగ్ సేసినా. ఆ నాయాళ్లకు రిగ్గింగ్ సేసే టోళ్ళే దొరకలేదు''

నోరు వెళ్లబెట్టడం అవధాని వంతు అయింది.

★